


వైసీపీ హయాంలో జిల్లాల పునర్విభజన అసమగ్రంగా జరిగింది. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి విడివడిన ఎన్టీఆర్ జిల్లా భౌగోళికంగా సరైన రీతిలో లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. విజయవాడ చెంతనే ఉన్న గన్నవరం, పెనమలూరు మండలాలను ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాల్సి ఉండగా, కృష్ణాజిల్లాలో చేర్చారు. ఈ రెండు మండలాలు గ్రేటర్ విజయవాడ విలీన ప్రాంతాల జాబితాలో ఉన్నా పట్టించుకోలేదు. గన్నవరం, గుడివాడ ఎమ్మెల్యేల రాజకీయం కారణంగా ప్రస్తుతం ఈ భౌగోళిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలతో పాటు అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. వ్యతిరేకత, అభ్యంతరాలు వచ్చినా ఖాతరు చేయకుండా ఇష్టానుసారంగా చేసిన ఈ విభజనను కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టాల్సిన అవసరముంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

అసమగ్ర విభజన..!

కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విభజన అస్తవ్యస్తం



విజయవాడ రూరల్ ఎటువైపు..?

పార్లమెంట్ నియోజకవర్గాల ప్రకారమే నిఖార్సుగా విభజన చేశామని వైసీపీ చెబుతున్నప్పటికీ, విజయవాడ రూరల్ మండలం గన్నవరం నియోజకవర్గంలోనే ఉంది. కానీ, గన్నవరం కృష్ణాజిల్లాలోకి రాగా, ఇందులోని ప్రధానమైన గ్రామాలన్నీ ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నాయి. ఆరు గ్రామాలను కృష్ణాజిల్లా పరిధిలోకి చేర్చారు. విజయవాడ రూరల్ మండలంలో మూడొంతులు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో, ఒకవంతు కృష్ణాజిల్లాలో కలిపారు. ఈ అసమగ్ర విభజన వల్ల విజయవాడ రూరల్ మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే మండలమైనా రెండు జిల్లాల పరిధిలో ఉంది.

గన్నవరం విభజనలో గజిబిజి

విజయవాడ అంతర్జాతీయ విమానా శ్రయం గన్నవరంలో ఉంది. కానీ, గన్నవరం ప్రాంతం కృష్ణాజిల్లాలో ఉంది. కాబట్టి ఇక్కడికి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్నవారు వచ్చి ఇక్కడ ప్రొటోకాల్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. విమానాశ్రయానికి రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు, ఉప రాష్ట్రపతులు, ప్రముఖులు వచ్చినప్పుడల్లా కృష్ణాజిల్లా అధికారులు బందరు నుంచి పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతం గన్నవరానికి పట్టుమని పది కిలోమీటర్ల దూరం కూడా లేదు. విజయవాడ నుంచి అయితే 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం 20 నిమిషాల్లోనే విమానాశ్రయానికి చేరుకోవచ్చు. అధికారుల ఇబ్బందులు పక్కన పెడితే, విజయవాడ విమానాశ్రయం ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉండాలి కానీ, కృష్ణాజిల్లా పరిధిలో ఎలా ఉంటుందన్న కనీస ఆలోచన కూడా నాటి అధికారులు చేయలేదు. జిల్లాల విభజన సమయంలో ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న విజయకుమార్ గతంలో వీజీటీఎం ఉడా వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయనకు గ్రేటర్ విలీన గ్రామాలపై అవగాహన ఉంది. అన్నీ తెలిసినా విజయవాడ ప్రజల అభీష్టం కంటే కూడా వైసీపీ ఎమ్మెల్యేల సిఫార్సులు, పెద్దల ఒత్తిళ్ల మేరకు అన్యాయంగా ఈ రెండు ప్రాంతాలను విడదీశారు.

పెనమలూరును పక్కన పెట్టుకుని..

విజయవాడను ఆనుకుని పెనమలూరు మండలం ఉంటుంది. ఈ మండల ప్రజలు విజయవాడతో మమేకమై ఉంటారు. ఏ అవసరాలున్నా వీరంతా విజయవాడకే వస్తారు. దూరాభారం కూడా ఉండదు. ఐదు కిలోమీటర్ల దూరం కూడా ఉండదు. కానీ, పెనమలూరు మండలాన్ని కృష్ణాజిల్లాలో విలీనం చేశారు. ఇక్కడి వారంతా విజయవాడ వదిలి, బందరు వరకూ వెళ్లాలంటే 60 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి.

నూజివీడు, ఆగిరిపల్లి అటా.. ఇటా..!

ఒకప్పటి ఉమ్మడి కృష్ణాలో అంతర్భాగంగా ఉన్న నూజివీడు, ఆగిరిపల్లి మండలాలు కూడా ఎన్టీఆర్ జిల్లాను ఆనుకుని ఉంటాయి. ఈ మండల ప్రజలకు విజయవాడతోనే ఎక్కువ లావాదేవీలు ఉంటాయి. వీటిని ఏలూరు జిల్లాలో కలిపారు. ఆగిరిపల్లి మండలం.. విజయవాడ

- మిగతా 6లో

గ్రామాల తీర్మానాలు తారుమారు

విజయవాడను గ్రేటర్ సిటీగా మార్చాలన్నది ఎప్పటి నుంచో ఉన్న ప్రతిపాదన. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ గ్రేటర్ కావాలని గన్నవరం, పెనమలూరు మండలాల్లోని గ్రామాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. అయితే, తమ పట్టు పోతుందన్న ఉద్దేశంతో కొందరు వైసీపీ నాయకులు స్థానిక పంచాయతీలపై ఒత్తిడి తెచ్చి వ్యతిరేక తీర్మానాలు చేయించారు. కానీ, ఒకటి, రెండు తప్ప మెజారిటీ గ్రామాలన్నీ గ్రేటర్ పరిధిలోకి వెళ్లడానికి సమ్మతిస్తూ తీర్మానాలు చేసి పంపాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాల పునర్విభజన పేరుతో విజయవాడలో అంతర్భాగం కావాల్సిన ప్రాంతాలను వేరే జిల్లాలోకి బదిలీ చేశారు.

ఇష్టానుసారంగా విడగొట్టేసిన వైసీపీ ప్రభుత్వం

ప్రజా వ్యతిరేకత వచ్చినా పట్టకుండా నిర్ణయం

- విజయవాడ పక్కనే ఉన్న గన్నవరం, పెనమలూరు
- గ్రేటర్ సిటీ జాబితాలో ఉన్న మండలాలు
- కాదని.. కృష్ణాజిల్లాలో కలిపిన గత పాలకులు
- మచిలీపట్నం వెళ్లాలంటే 65 కిలోమీటర్ల దూరం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, అధికారులు
- విజయవాడ రూరల్ మండల విభజనలో గజిబిజి
- ఏ మండలం ఎటువైపో తెలియని గందరగోళం
- నూజివీడు, ఆగిరిపల్లి మండలాలు ఏలూరు జిల్లాలోకి..
- ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని స్థానికుల డిమాండ్

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. జూన్‌లో ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు ప్రారంభించాలా? వద్దా? అనే సంశయంలో పడ్డారు. పులిచింతల ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో ప్రకాశం బ్యారేజీకి ఇప్పట్లో సాగునీరు వచ్చే అవకాశం లేదు. ఈనెలలో మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు కురిసి ముసురుపట్టి వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారితేనే రైతులు పూర్తిస్థాయిలో సాగు పనుల్లో నిమగ్నమవుతారు. జూన్‌నెల సగం పూర్తయినా జిల్లాలో ఇంకా వడగాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. కృష్ణాడెల్టాకు సాగు, తాగునీటి అవసరాల కోసం పట్టిసీమ ప్రాజెక్టు నుంచి నీటిని పంపింగ్ చేసేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అక్కడ నీరు అందుబాటులోకి రాగానే నీటిని తోడేందుకు సర్వం సిద్ధం చేశామని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.

వర్షమా.. ఏదీ నీ చిరునామా?



దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేసి ఉన్న పొలం

వరుణుడి కరుణ కోసం రైతుల ఎదురుచూపులు

- భారీవర్షాలు కురిస్తేనే కాలువలకు నీరు
- ఈ నెలాఖరుకైనా వాతావరణం సాగుకు అనుకూలించేనా
- ఖరీఫ్ సీజన్ ఈ ఏడాది ఆలస్యమయ్యే సూచనలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈఏడాది ఖరీఫ్‌సీజన్‌లో 1,72,435 హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు జరుగుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. వరిసాగు 1,65,789 హెక్టార్లలో, చెరకు 4,310 హెక్టార్లలో, వేరుశెనగ, మినుము, మొక్కజొన్న పత్తి తదితర పంటలు సాగుచేయాల్సి ఉంది. కృష్ణాడెల్టాకు సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రధాన కాలువల ద్వారా కనీసంగా 85 టీఎంసీల నీటిని విడుదల చేయాలి. ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుతం రెండు టీఎంసీల నీరు కూడా అందుబాటులో లేదు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో, తెలంగాణాలో రానున్న నెలరోజుల వ్యవధిలో భారీవర్షాలు కురిస్తేనే కృష్ణానదిలోకి నీరు చేరుతుంది. పులించింతల ప్రాజెక్టులోకి కనీసంగా 15 నుంచి 20 టీఎంసీల నీరుచేరితే దిగువకు నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇంతమేర నీరు ఈ ప్రాజెక్టులోకి ఎప్పటికి చేరుతుంది? ఎప్పటికి ఈ నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేయడానికి అవకాశం ఏర్పడుతుంది? అనేది తేలాలి. శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం, మంత్రులు బాధ్యతల స్వీకరణ, అసెంబ్లీ సమావేశాల తదుపరి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జరుగుతుందని, అప్పుడు కాలువలకు సాగునీటిని విడుదల చేసే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సాగునీటి విడుదలపై ప్రభుత్వం నుంచి తగువిధంగా స్పష్టమైన ప్రకటన విడుదలైతే రైతులు నారుమడులు పోసుకోవడం, నాట్లు వేయడం వంటి పనులను ప్రారంభిస్తారు.

కాలువల మరమ్మతులు ఉన్నట్టా? లేనట్టా?

వైసీపీ ప్రభుత్వం గడచిన నాలుగు సంవత్సరాల్లో కాలువల ఆధునికీకరణ పనులను పక్కన పెట్టేసింది. దీంతో ప్రధాన పంట కాలువల్లో, డ్రెయిన్‌లలో గుర్రపుడెక్క, నాచు, జమ్ము, కిక్కిస వంటివి పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. గత రెండేళ్లుగా వరి పంట చేతికొచ్చే సమయంలో తుపానుల ప్రభావంతో కురిసిన భారీవర్షాల కారణంగా రైతులు పంటలు కోల్పోయారు. డ్రెయిన్‌ల ద్వారా వర్షపునీరు సకాలంలో బయటకుపోలేదు. గతేడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుపాను కారణంగా జిల్లాలో లక్ష హెక్టార్లలో చేతికొచ్చేదశలో ఉన్న వరిపంట నీటమునిగింది. పంట నీటమునగడంతో పామర్రు, చల్లపల్లి, మొవ్వ తదితర ప్రాంతాల్లో రైతులు పంటను కోయకుండానే దమ్ముచేయించారు. ఈ తరహా అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ప్రధాన డ్రెయిన్‌లను ఈ ఏడాది జనవరి నుంచి మరమ్మతులు చేయిస్తారని రైతులు ఆశిస్తే వైసీపీ ప్రభుత్వం, పాలకులు పట్టించుకోలేదు. ఈలోగా ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో కాలువల మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ అధికారులు రూ.25 కోట్లతో తయారుచేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినా ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభించలేదు. ప్రస్తుతం జూన్‌నెల సగం పూర్తయింది. ఈ పనులకు నూతన ప్రభుత్వం ఆమోదం తెలిపినా ఎంతమేర, ఎప్పటిలోగా ఈ ఏడాది కాలువల మరమ్మతుల పనులు చేస్తారనేది అనుమానంగా మారింది.

సబ్సిడీపై వరి విత్తనాలు

కాలువలకు నీటిని ఎప్పుడు విడుదల చేసినా రైతులు నారుమడులు పోసుకునేందుకు వ్యవసాయశాఖ 6,900 క్వింటాళ్ల వరి విత్తనాలను సబ్సిడీపై ఇచ్చేందుకు రప్పించింది. ఇందులో ఎంటీయూ 1318 రకం విత్తనాలు 3,900 క్వింటాళ్లు రాగా, వాటిలో 1765 క్వింటాళ్లను రైతులకు అందజేశారు. ఎంటీయూ 1061 రకం విత్తనాలు 1200 క్వింటాళ్లు రాగా 591 క్వింటాళ్లను రైతులకు ఇచ్చారు. బీపీటీ-5204 రకం విత్తనాలు 1241 క్వింటాళ్లు రాగా, వాటిలో 118 క్వింటాళ్లను రైతులకు అందజేశారు. ఈ ఏడాది రైతులు ఎంటీయూ 1318 రకం విత్తనాలను అధికంగా సాగుచేసే యోచనలో ఉన్నారు. కంకిపాడు మండలంలోని కోలవెన్ను తదితర ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిన వరి విత్తనాలు చల్లి బోరునీటి ఆధారంగా పైరును బతికించుకునే ప్రయత్నంలో రైతులు ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై నిబంధనల ఉల్లంఘన



వాహనంపై స్టిక్కర్‌తో కొండపైకి మహిళ

- గుర్తించని టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బంది
- పటిష్ట ఏర్పాట్లు చేయాలని భక్తుల సూచన

6లో..

మల్లవల్లిపై మళ్లీ ఆశలు



మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ (ఐపీ) అభివృద్ధిపై మళ్లీ ఆశలు నెలకొన్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో ఈ పార్కులో పరిశ్రమల పునరుజ్జీవానికి అడుగులు పడినట్టే అయ్యింది. రాష్ట్ర విభజన జరిగాక రాజధాని అమరావతి పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో గతంలో టీడీపీ హయాంలో ఈ ఐపీకి శ్రీకారం చుట్టగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ కక్షకట్టి విజిలెన్స్ విచారణల పేరుతో భయభ్రాంతులకు గురిచేసింది. పనులు చేయలేదన్న వంకతో భూ కేటాయింపుల రద్దుకు పాల్పడింది. పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించలేకపోవటం, ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు కాకపోవటంతో మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఇన్నాళ్లూ అనాథలా మిగిలిపోయింది. తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మల్లవల్లి పారిశ్రామికవాడపై ఆశలు చిగురిస్తున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

వైసీపీ పాలనలో అనాథలా అతిపెద్ద ఇండస్ట్రియల్ ఏరియా

యూనిట్ల నిర్వాహకులకు వేధింపులు.. విజిలెన్స్ విచారణలు

- భూ కేటాయింపులు రద్దు.. భూముల ధరల పెంపు..
- వెనకడుగు వేసి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలు
- టీడీపీ కూటమి గెలుపుతో ఆనందోత్సాహాలు
- పునరుజ్జీవం కోసం ఔత్సాహికుల ఎదురుచూపులు

గతంలో టీడీపీ హయాంలో..

రాష్ట్ర విభజన తర్వాత రాజధానిగా అమరావతిని ప్రకటించాక కృష్ణాజిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయటానికి వీలుగా మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ కోసం చర్యలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా హైదరాబాద్‌లో పరిశ్రమలు పెట్టిన వారితో పాటు దేశ వ్యాప్తంగా పలు పారిశ్రామికవేత్తలతో ఏపీలో కూడా పెట్టుబడులు పెట్టించాలన్న ఉద్దేశంతో మల్లవల్లి ఐపీని ఎంచుకున్నారు. ఇందుకోసం 1,100 ఎకరాలు సేకరించారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకు ఇందులో చౌకగా ప్లాట్లు కేటాయించాలని నిర్ణయించారు. దీంతో అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్ వంటి భారీ సంస్థలతో పాటు ఎంఎస్ఎంఈ సంస్థలు కూడా దరఖాస్తు చేసుకున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున భూ కేటాయింపులు చేశారు. అశోక్ లేల్యాండ్, మోహన్ స్పిన్‌టెక్స్‌లు పరిశ్రమలు ఏర్పాటు చేశాయి. వందలాది ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పే దిశగా పనులు ప్రారంభమయ్యాయి.

వైసీపీ వచ్చాక..



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మల్లవల్లి సర్వనాశనమైంది. ఇచ్చిన ప్లాట్లు కొండల్లా, లోయలో ఉన్నట్టు ఉండటంతో వాటిని తొలగించాలన్నా, మట్టిని నింపాలన్నా ఖర్చు, కాలాతీతమని కొంతమేర పనుల్లో జాప్యం జరిగింది. అయితే, పారిశ్రామికవేత్తల విన్నపాలను వైసీపీ ప్రభుత్వం వినలేదు. యూనిట్ల నిర్వాహకులకు నోటీసులు జారీచేసి, వారి భూ కేటాయింపులను రద్దు చేసింది. యూనిట్ల నిర్వాహకులు కోర్టును ఆశ్రయించారు. ఇదే సమయంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వైసీపీ ప్రభుత్వం అమాంతం పెంచేసింది. పెరిగిన ధరలపై పారిశ్రామికవేత్తలు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అయినప్పటికీ వారి గోడును వైసీపీ వినలేదు. దీంతో ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు పరిశ్రమలను ఏర్పాటు చేయలేకపోయారు. ఇది స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచే అంశంపైనా ప్రభావం పడింది. చిన్నవే కాకుండా పెద్ద పరిశ్రమల విషయంలో కూడా వైసీపీ ఇదే వైఖరి అవలంబించింది. అశోక్ లేల్యాండ్ సంస్థ పెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేసి, ఉత్పాదకత కూడా ప్రారంభించింది. కరోనా వల్ల ఆ సంస్థకు కొన్ని ఇబ్బందులు వచ్చాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

- మిగతా 6లో

వర్సిటీలో అక్రమాల పీహెచ్‌డీ



కృష్ణా యూనివర్సిటీ

ఒకరి థీసిస్ మరొకరు చేసినట్టుగా చూపి హెచ్‌డీ పట్టా ప్రదానం

- నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్న కృష్ణా యూనివర్సిటీ అధికారులు
- అధికారుల అక్రమాలపై ఐటీ, మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు
- అక్రమాలపై విచారణకు ప్రత్యేక కమిటీ వేయాలని లేఖ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టాల ప్రదానం ప్రహసనంగా మారింది. నిబంధనలు పాటించకుండా తమకు అనుకూలమైన వారికి పీహెచ్‌డీ పట్టాలిస్తూ అనుకూలంగా లేనివారిని నెలల తరబడి తమ చుట్టూ తిప్పుకోవడం వివాదాస్పదమవుతోంది. యూనివర్సిటీలో ఐదేళ్లుగా పీహెచ్‌డీ పట్టాలు అందజేయడంలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, యూనివర్సిటీ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలపై రాష్ట్ర ఐటీ, మానవవనరులశాఖ మంత్రి నారా లోకేష్‌కు యూనివర్సిటీలో పనిచేస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ చెరుకూరి జయశంకరప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులోని వివరాలు ఆయన మాటల్లో..

యూనివర్సిటీలో పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వడంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, యూనివర్సిటీలో పనిచేసిన వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ విభాగం అధికారులు తమ చిత్తానుసారంగా వ్యవహరించారు.

- పరిశోధనలు, ప్రయోగాలు చేయకుండానే నకిలీ ఐఏఈసీ సర్టిఫికెట్లతో బయోటెక్నాలజీ విభాగంలో ఒక మహిళా పరిశోధక విద్యార్థినికి మూడు వారాల్లోపే పీహెచ్‌డీ పట్టాను కట్టబెట్టారు.
- మేనేజ్‌మెంట్ విభాగంలో ఒక మహిళా పరిశోధక విద్యార్థిని మూడు థీసిస్‌లను సమర్పించకున్నా, వేరొక రీసెర్చ్ స్కాలర్ పరిశోధనచేసి సమర్పించిన థీసిస్‌ను ఆమె సమర్పించినట్టుగా చూపి వైవా పరీక్షను నిర్వహించారు. ఈ వ్యవహారంలో సంబంధిత డిపార్ట్‌మెంట్ అధికారికి తెలియకుండా, డెప్యుటేషన్‌పై వేరొక ప్రాంతంలో పనిచేస్తున్న అధ్యాపకుడిని పిలిపించి అన్నీ సక్రమంగా ఉన్నట్టుగా చూపి పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు.
- మెడికల్ టూరిజం పరిశోధన చేసిన కూనపరెడ్డి జ్యోత్స్న అనే విద్యార్థి పరిశోధనాపత్రాలు సమర్పించి ఎనిమిది నెలలు అయినా వైవా పరీక్ష నిర్వహించకుండా ఆలస్యం చేస్తూనే ఉన్నారు.
- కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, గణితం, ఫార్మసీ, విభాగాల్లోని పలువురు పరిశోధన విద్యార్థులు యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వేధింపులు తట్టుకోలేక తమ పరిశోధనలను మధ్యలోనే విడిచి పెట్టేశారు.

- మిగతా 6లో

అఘాయిత్యాలు వద్దు..
ఫర్నీచర్ వెనక్కిచ్చేయ్!

జగన్‌రెడ్డిపై నెట్టెం ఘాటు విమర్శలు



జగ్గయ్యపేట, జూన్ 17 : ఒక సోఫా, టేబుల్ తన కార్యాలయంలో ఉన్నాయని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ నిజాయితీగా ప్రభుత్వానికి సమాచారం ఇస్తే దొంగ ముద్ర వేసి అఘాయిత్యానికి పాల్పడేలా చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి తన ఇంట్లో లక్షలాది రూపాయాల ఫర్నీచర్‌ను ఎలా ఉంచుకున్నాడని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ప్రశ్నించారు. 'కోడెలలా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, నిజాయితీ, వ్యక్తిత్వం ఏమాత్రం లేని జగన్‌రెడ్డి ఆయనలా ఆత్మత్యాగానికి పాల్పడనవసరం లేదు.. ఆ ఫర్నీచర్‌ను వెనక్కి ఇచ్చేస్తే చాలు'.. అని నెట్టెం వ్యాఖ్యానించారు. జగన్ క్యాంప్ నివాసానికి సెక్యూరిటీ, ఫర్నీచర్ కింద రూ.15.65 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశాడని ఆరోపించారు.

మీ గెలుపు ఓ సక్సెస్ స్టోరీ

లోకేశ్‌కు గొట్టిపాటి అభినందన



విజయవాడ, జూన్ 17 : టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గంలో సాధించిన గెలుపు యువ రాజకీయ నాయకులకు ఓ సక్సెస్ పాఠమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం లోకేశ్‌ను కలిసి అభినందనలు తెలియజేసిన గొట్టిపాటి అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి పట్టు లేని నియోజకవర్గంలో పట్టుబట్టి పోటీ చేసి ఓసారి ఓటమి ఎదురైనా వెనుదిరగక అక్కడి నుంచే తిరుగులేని మెజారిటీతో గెలవడం వెనుక చాలా కృషి ఉందన్నారు. ఈ గెలుపు యువ నాయకులకు స్ఫూర్తిపాఠమన్నారు.

కూటమి విజయం.. తలనీలాల సమర్పణ



గుడ్లవల్లేరు, జూన్ 17 : డోకిపర్రు గ్రామానికి చెందిన ఐటీడీపీ కన్వీనర్ షేక్ జాని చంద్రబాబు ముఖ్యమంత్రిగా, గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము విజయం సాధించాలని కోరుతూ అల్లాకు మొక్కాడు. ఈ నేపథ్యంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా డోకిపర్రు తురాయిపాలెం జెండా సెంటర్లో ఐదుగురి వద్ద భిక్షాటన చేసి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు.



బందరు ఈద్గా వద్ద ప్రార్థనల్లో కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణ

ముస్లింలకు రంజాన్ తోఫా పునరుద్ధరిస్తాం

బక్రీద్ వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : ముస్లింలకు రంజాన్ తోఫా పునరుద్ధరిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బక్రీద్ సందర్భంగా ఆదివారం మచిలీపట్నం ఉల్లింగిపాలెం ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మంత్రి రవీంద్రతోపాటు జనసేన నియోజక వర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ టీడీపీ నేతలు ఎండీ ఇలియాస్ బాషా, ఖాజా, జనసేన నేతలు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, అల్లా ఆశీర్వాదాలు రాష్ట్ర ప్రజలపై మెండుగా ఉండాలన్నారు. ముస్లింలకు ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఖాజీ మహమ్మద్ హుస్సైన్ ఈ సందర్భంగా పవిత్ర ఖురాన్‌లోని దివ్య వచనాలను వినిపించి సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఫిరోజ్, అమీర్, బాజాని, మౌలానా, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.



కొనకళ్లను సత్కరిస్తున్న జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి

ప్రభుత్వ పాలనలో తెలుగు యువతది కీలక పాత్ర

కొనకళ్ల నారాయణ

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : సాధారణ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తెలుగు యువత ఎలా కష్టపడి పనిచేశారో అదే స్ఫూర్తితో ప్రభుత్వం పాలనా కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లాలని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఆదివారం కొనకళ్ల నారాయణను కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి కలిసారు. కూటమి విజయంపై సమీక్షా సమావేశంలో చర్చించారు. యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు చంద్రబాబు నైపుణ్యాభివృద్ధి ఫైలుపై సంతకం చేశారన్నారు.



టీడీపీ కార్యకర్తలు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మండలి వెంకట్రామ్

ఘంటసాలపాలెంలో కూటమి విజయోత్సవం

తొమ్మిది మందికి సైకిళ్ల పంపిణీ

ఘంటసాల, జూన్ 17 : ఘంటసాల పాలెంలో కూటమి విజయోత్సవ వేడుకలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల, ఘంటసాల పాలెం, దేవరకోట, కొత్తపల్లి, తాడేపల్లి, కొడాలి, చిట్టూర్పు గ్రామాలకు చెందిన ఏడుగురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఇద్దరు విద్యార్థులకు రూ.63 వేల విలువ గల సైకిళ్లను వేమూరి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు సాయిబాబు, శ్రీనివాస్‌లు అవనిగడ్డ ఎమ్మెల్యే కుమారుడు మండలి వెంకట్రామ్ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లతో సాధ్యమని నమ్మిన ప్రజలు కూటమిని గెలిపించారని, ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తొలుత వేమూరి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. అనంతరం మండలి వెంకట్రామ్‌ను శ్రీనివాస్, సాయిబాబులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, టీడీపీ నేతలు వేమూరి సాయి వెంకటరమణ, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, గుత్తికొండ వరప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, గొర్రెపాటి శ్రీనివాస్, విజయవాడకు చెందిన ఎల్.ఎస్.కుమార్, కాజ చక్రధర్‌రావు, వల్లభనేని నాని, కేవీఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల గ్రీవెన్స్

మచిలీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో ఈ సమావేశం జరుగుతుందని, అన్ని విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమావేశానికి హాజరై తమ సమస్యలను వివరించవచ్చని కలెక్టర్ తెలిపారు.

మార్పుకోసం తహతహ!

- **తిరువూరులో తారస్థాయికి వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు**
- **పార్టీ ఓటమితో పలువురు పక్కచూపులు**
- **బోర్డు మార్పుకోసం రాయబారాలు!**

తిరువూరు మునిసిపల్ కార్యాలయం



తిరువూరు, జూన్ 17 : మునిసిపల్ పాలకవర్గానికి చెందిన వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకోవడంతో కొందరు టీడీపీ వైపు చూస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మునిసిపల్ ఎన్నికల అనంతరం స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే వైసీపీ అధిష్ఠానం ఆశీస్సులతో గత్తం కస్తూరిబాయి ఛైర్‌పర్సన్‌గా పాలన చేపట్టారు. బోర్డు ఏర్పాటు సమయంలో రెండేళ్ల పదవీకాలం అనంతరం మరొకరికి అవకాశం కల్పించాలని, స్థానిక నాయకత్వం తీర్మానించింది. ఒప్పందం ప్రకారం పదవీకాలం పూర్తయినా బోర్డులో మార్పులేకపోవడంతో, వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు సమావేశాలకు గైర్హాజరవడంతో కోరంలేక పలుమార్లు సమావేశాలు వాయిదా వేశారు. సహాయ నిరాకరణ చేసిన కౌన్సిలర్లు ఛైర్మన్ మార్పు కోసం తమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది.

అనుమతుల్లేని భవన నిర్మాణంపై ఫిర్యాదు

పట్టణంలో ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఎటువంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణంపై వైసీపీకి చెందిన కౌన్సిలర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కౌన్సిలర్ల మధ్య విభేదాలు మరింత తీవ్రతరంగా మారాయి. భవన నిర్మాణం చెపట్టిన వైసీపీకి చెందిన కౌన్సిలర్ బంధువు తమ పార్టీ వారే ఫిర్యాదు చేయడంపై మిగిలిన కౌన్సిలర్లను ప్రశ్నించగా, ఫిర్యాదుకు పార్టీకి సంబంధం లేదని చెప్పి తప్పించుకున్నట్టు తెలుస్తున్నది. అయితే వైస్‌ఛైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న మరో కౌన్సిలర్ బోర్డు మార్పుపై చక్రతిప్పేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

పార్టీ ఓటమితో పక్కచూపులు..

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు టీడీపీ నేతల టచ్‌లోకి వచ్చినట్టు తెలుస్తున్నది. స్థానిక టీడీపీ అధిష్ఠానం మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకోకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నది.

గత ఒప్పందం ప్రకారం మునిసిపల్ ఛైర్‌పర్సన్ మార్పునకు సహకారం అందించాలని వైసీపీ కౌన్సిలర్లు కొందరు పెద్దలవద్ద ప్రస్తావిస్తున్నట్టు సమాచారం. బోర్డులో 20 మంది కౌన్సిలర్లకుగాను 17 మంది వైసీపీ కాగా ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లు. ఛైర్‌పర్సన్ మార్పుకోసం అవసరమైతే పార్టీ మారేందుకైన తాము సిద్ధమని సంకేతాలు పంపుతున్నారు. నాలుగేళ్ల పూర్తయిన తర్వాత అవిశ్వాసం పెట్టే అవకాశం ఉండంతో, ఆ దిశగా యోచన చేస్తున్న సమాచారం చక్కర్లు కొడుతుండటంతో, ఎలాగైనా బోర్డు మారకపోతుందా అనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.



మంత్రికి బొకే ఇస్తున్న పోలినేని అంకమ్మ చౌదరి

మంత్రి రవీంద్రకు శాప్ మాజీ ఛైర్మన్ శుభాకాంక్షలు

విజయవాడ స్పోర్ట్సు, జూన్ 17: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించిన కొల్లు రవీంద్రను నగరంలోని ఆయన నివాసంలో శాప్ మాజీ ఛైర్మన్ పోలినేని అంకమ్మ చౌదరి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన కార్యక్రమాలపై అంకమ్మ చర్చించారు. ఎ.ప్రశాంత్ చౌదరి, విప్లవ వంశీ, ఎం.నర్సింహరావులు మంత్రిని అభినందించిన వారిలో ఉన్నారు.

20 నుంచి ఐటీఐలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

భారతీనగర్, జూన్ 17 : 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఎన్టీఆర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూన్ 20 నుంచి జూన్ 22వరకు మెరిట్ నెంబర్ ప్రకారం ఒరిజినల్ సర్టిఫికెట్స్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన ఎస్సీ, ఎస్టీ మినహా మిగిలిన కేటగిరి అభ్యర్థులు రూ.60 డిపాజిట్, ప్రైవేట్ ఐటీఐలో చేరగోరే అభ్యర్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. జూన్ 20 ఉదయం 8.00గంటల నుంచి 2 గంటల వరకు మెరిట్ నెంబర్ 1 నుంచి 162 వరకు, గ్రేడ్ 6.8నుంచి 10 వరకు గల అభ్యర్థులకు, మధ్యాహ్నం 2.00గంటల నుంచి నెంబర్ 163 నుంచి 333 వరకు, గ్రేడ్ 5.5నుంచి 6.7వరకు గల అభ్యర్థులకు, జూన్21 తేదీన ఉదయం 8.00గంటలనుంచి 2.00 గంటల వరకు నెంబర్ 334 నుంచి 486 వరకు, గ్రేడ్ 4.4నుంచి 5.4వరకు గల అభ్యర్థులు, మధ్యాహ్నం 2.00గంటల నుంచి నెంబర్ 487 నుంచి 646 వరకు, గ్రేడ్ 4.3నుంచి దిగువ గ్రేడ్ వరకు గల అభ్యర్థులు, జనరల్ కేటగిరీ అభ్యర్థులు జూన్22 తేదీన ఉదయం 8.00గంటల నుంచి 2.00 గంటల వరకు నెంబర్ 1 నుంచి 333 వరకు, గ్రేడ్ 5.5నుంచి 10వరకు గల అభ్యర్థులు, మధ్యాహ్నం 2.00గంటలకు నెంబర్ 334 నుంచి 664 వరకు, గ్రేడ్ పాయింట్ 5.4నుంచి దిగువ గ్రేడ్ వరకు గల అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యుఎస్ పత్రం, ఆధార కార్డు, స్టడి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావలన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రంతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

దుర్గమ్మకు బంగారు నత్తువ కానుక



అమ్మవారికి నత్తువ సమర్పిస్తున్న భక్తులు

వన్‌టౌన్, జూన్ 17 : ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ అలంకరణ నిమిత్తం నగరానికి చెందిన పి.రాజకుమార్ ఆయన కుటుంబసభ్యులు 27 గ్రాముల బంగారు నత్తువను కానుకగా సమర్పించారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన రాజకుమార్ ఆయన కుటుంబ సభ్యులు ఏఈవో రమేష్ ద్వారా నత్తువను అందజేశారు. దాతలకు అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం కల్పించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి



దుర్గమ్మ దర్శనార్థం సోమవారం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబసభ్యులు విచ్చేశారు. ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలు అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

తిరుమల తిరుపతి దేవస్థానానికి పది టన్నుల కూరగాయల వితరణ



కూరగాయల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న గద్దె క్రాంతి కుమార్

భారతీనగర్, జూన్ 17 : తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మండవ కుటుంబరావు ఆశీస్సులతో మండవ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరామచంద్రనగర్ కాలనీ వినాయకుడి గుడి రోడ్‌లో నుంచి సోమవారం దాతలు ధనేకుల నాగేంద్రబాబు(బాబీ), దుర్గ దంపతులు, వారి కుమారుడు సావంత్ సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానానికి నిత్యాన్నదాన పథకానికి ఉచితంగా 10టన్నుల కూరగాయలను పంపించారు. కూరగాయల బండిని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు ధనేకుల సత్యనారాయణ, నాగేంద్ర, పలువురు బంధుమిత్రులు పాల్గొన్నారు.



ఇంద్రకీలాద్రిపై అన్యమత స్టిక్కర్ ఉన్న వాహనం

ఇంద్రకీలాద్రిపై
నిబంధనల ఉల్లంఘన!

- **వాహనంపై అన్యమత స్టిక్కర్‌తో మహిళ**
- **గుర్తించని టోల్‌గేట్ సెక్యూరిటీ సిబ్బంది**
- **పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని భక్తుల సూచన**

వన్‌టౌన్, జూన్ 17 : హిందూ ఆలయాలలోకి అన్యమతస్తులు వారి మతపరమైన స్టిక్కర్‌లు గాని ఆరాధించే దైవాల బొమ్మలతో గానీ రాకూడదని నిబంధన ఉంది. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో హిందూ ధర్మం మేరకు ఆలయ ప్రవేశాలకు సంబంధించి నియమ నిబంధనలు అమలు చేస్తున్నారు. అయితే సోమవారం ఓ మహిళ ద్విచక్ర వాహనంపై అమ్మవారి దర్శనార్థం వచ్చారు. ఆమె వచ్చిన ద్విచక్ర వాహనంపై ఏసుక్రీస్తు చిత్రం ఉండటం చర్చనీయాంశమైంది. ఘాట్‌రోడ్డు నుంచి వెళుతున్న వాహనాన్ని టోల్‌గేట్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు నిలువరించాల్సి ఉంది. అయితే వారంతా విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటంతో ఇలా అన్యమతస్తులు తమ వాహనాలపై స్టిక్కర్‌లు ఉన్నప్పటికీ యథేచ్ఛగా వచ్చేస్తున్నారన్న భక్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కనకదుర్గానగర్‌లో పలువురు భక్తుల కారు అద్దాలపై సిలువ గుర్తు ఉండటంతో అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. కాగా వారు సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడ్డారు. అనంతరం ఆవేశంగా సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి దిగారు.

అసమగ్ర విభజన..!

(5వ పేజీ తరువాయి)

మెగాసిటీ విలీన ప్రతిపాదన జాబితాలో ఉంది. నూజివీడు మండల ప్రజలంతా ఎన్టీఆర్ జిల్లాతో నిత్యం ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటారు. వారికి ఏలూరు దూరాభారమే. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వచ్చినపుడు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని నూజివీడు మండల ప్రజలు కోరారు. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించటంతో పాటు అధికారంలో రాగానే నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గన్నవరం, పెనమలూరు మండలాలతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, విజయవాడ రూరల్ మండలాలను కూడా ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

పల్లా శ్రీనివాస్ యాదవ్ నియామకంపై జనసేన హర్షం

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను నియమించడం పట్ల జనసేన నగర అధ్యక్షుడు బండి రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జనసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గడ్డం రాజు మాట్లాడారు. 95వేల అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను వైసీపీ నాయకులు కక్షగట్టి వేధించారన్నారు. పల్లా శ్రీనివాస్ యాదవ్ నాయకత్వంలో టీడీపీ, జనసేన నాయకులు సమన్వయంతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వర్సిటీలో అక్రమాల పీహెచ్‌డీ

(5వ పేజీ తరువాయి)

- వాణిజ్య విభాగంలో అమిత అనే విద్యార్థిని తన థీసిస్‌ను సమర్పించి 14 నెలలు గడిచినా పీహెచ్‌డీని అందజేయకపోవడంతో ఆమె ఉద్యోగం పోగొట్టుకుని ఆ దిగులుతో బలవన్మరణం చెందారు. ఈ అంశంపై ఎలాంటి విచారణ చేయకుండా తొక్కిపెట్టారు.
- జర్నలిజం, మాస్ కమ్యునికేషన్ విభాగం యూనివర్సిటీలో రద్దయి రెండేళ్లు గడిచినా జర్నలిజంలో ఒకరికి గత ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఇటీవల పీహెచ్‌డీని అందజేశారు.
- పరిశోధన విభాగంలో విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన ఏడాది కాలం తరువాత కూడా పీహెచ్‌డీ పట్టాలను ఇవ్వడం లేదు.
- గత ఐదేళ్లగా అప్పటి రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తి యూనివర్శిటీ అధికారులు పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన అంశాల్లో నిబంధలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.
- యూనివర్శిటీలో బాలుర, బాలికల వసతి గృహాల భవనాలు నిర్మాణం చేయకుండానే కోట్లాది రూపాయల బిల్లులు చేశారు. యూనివర్శిటీలో జరిగిన అవకతవకలపై ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలి.

మల్లవల్లిపై మళ్లీ ఆశలు

(5వ పేజీ తరువాయి)

మెగా ఫుడ్ పార్క్ పరిస్థితి మరీ దారుణం

మల్లవల్లిలో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కోసం లే అవుట్ వేశారు. సెంట్రల్ ఫుడ్‌పార్క్‌తో పాటు స్టేట్ ఫుడ్‌పార్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయి. వైసీపీ వచ్చాక ఫుడ్‌పార్క్ ధరలు మరింత పెరిగాయి. ఈ ధరలను చూసి కొత్తగా ఎవరూ ముందుకు రాలేదు. అలాగే, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మెగాఫుడ్ పార్కులో సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలన్నీ జ్యూస్ తీయటానికి, ప్యాకింగ్ చేయటానికి వీలుగా సీపీసీలో మెషినరీ ఏర్పాటు చేశారు. కోల్డ్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ, వైసీపీ దీనిని అందుబాటులోకి తీసుకురాలేకపోయింది.



చింతలపూడి ఎత్తిపోతల వద్ద అధికారులతో మాట్లాడుతున్న వసంత కృష్ణప్రసాద్

చింతలపూడి పూర్తికి కృషి

ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

జి.కొండూరు, జూన్ 17 : మెట్ట ప్రాంత రైతుల చిరకాల స్వప్నం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన పోలవరం సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా చింతలపూడి పథకం పూర్తి నిమిత్తం చంద్రబాబుకు వినితిపత్రం అందజేసిన అనంతరం పథకాన్ని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతుల పాలిట వరం చింతలపూడి

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో సాగునీటి కష్టాలు రాకుండా ఉండేందుకు సీఎం చంద్రబాబు ముందుచూపుతో రూ.4,909 కోట్లతో ప్రారంభించిన చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే వసంత అన్నారు. 2014-19 మధ్య సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఈపథకాన్ని పూర్తిగా విస్మరించి రైతుల ఉసురు పోసుకుందన్నారు. ఈ పథకం పూర్తయితే తిరువూరు, మైలవరం, నూజివీడు, గన్నవరం, నందిగామ నియోజకవర్గాల్లోని 18 మండలాల రైతుల సాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. ఎన్ఎస్‌పీ మూడోజోన్‌లో ఉన్న 2.36 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అంది ఆయకట్టు స్థిరీకరించబడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కె.విజయబాబు, చెన్నుబోయిన చిట్టిబాబు, ఉయ్యూరు వెంకటనరసింహారావు, పాలంకి మోహన్ మురళీ రెడ్డి, ఉయ్యూరు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి అనిత నివాస భవనాన్ని పరిశీలించిన అధికారులు



పెనమలూరు, జూన్ 17 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నివాసముండేందుకు భవనాన్ని పోలీసు, మునిసిపల్ అధికారులు సోమవారం పరిశీలించారు. తాడిగడప మునిసిపాలిటీ కానూరు కొత్త ఆటోనగర్ రెండో రోడ్డులోని ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీశ్‌కు చెందిన భవనాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, అదనపు ఎస్పీ ప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌లు పరిశీలించారు. భవనంలో సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్టు వారు తెలిపారు.

పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం



ఇబ్రహీంపట్నం, జూన్ 17 : ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 20, 21 తేదీల్లో నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నందు జరిగే ట్రైనింగ్ నీడ్ అసిస్టెంట్ శిక్షణా తరగతుల్లో ఏపీ నుంచి జ్యోత్స్న ఎంపికయ్యారు. ఈమేరకు ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పీఈటీలను నియమించండి

పెనుగంచిప్రోలు, జూన్ 17 : రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే ఉపాధ్యాయ నియామకాల్లో (డీఎస్సీ) పాఠశాల క్రీడాభివృద్ధికి ప్రాథమికోన్నత పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయుల(పీఈటీ)ను నియమించాలని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర నేత అజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు క్రీడల ఆవశ్యకతను గుర్తించి పాఠశాలలల్లో క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలకు పీఈటీలను నియమించారని గుర్తు చేశారు. వ్యాయామ విద్య సాధారణ విద్యలో భాగమన్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్న చోట వ్యాయామ ఉపాధ్యాయుడిని, 600 నుంచి 700 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని ప్రకటనలో కొత్త ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

గువహటి-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు దారి మళ్లింపు

రైల్వేస్టేషన్, జూన్ 17 : అగర్తలా-సెల్దా కాంచన గంగ ఎక్స్‌ప్రెస్ (13174) పట్టాలు తప్పిన కారణంగా గువహటి-ఎస్ఎంవీటీ బెంగళూరు రైలు (12510)ను దారి మళ్లిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి సీహెచ్ రాకేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గువహటిలో బయల్దేరిన రైలును న్యూ జల్పాయ్‌గురి-సిలిగురి-బాగ్డోగ్రా-అలువబారిరోడ్డు జంక్షన్ మీదుగా మళ్లించారు.

ఘనంగా వెంపటి పెద్ద సత్యం వర్ధంతి

కూచిపూడి, జూన్ 17 : ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు వెంపటి పెద్ద సత్యం వర్ధంతి వేడుకలు సోమవారం కూచిపూడిలో ఘనంగా నిర్వహించారు. కూచిపూడి శ్రీ సిద్దేంద్ర కళావేదికపై కళాకారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపచేశాయి. డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, ఎల్లాజోశ్యుల అనురాధ, మల్లిశెట్టి అనూష శిష్యులు భామా కలాప ప్రవేశ దరువు, ఆనంద నర్తన గణపతి, శివుడు తాండవమాడేను, అన్నమాచార్య కీర్తన అంశాల్లో ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నాట్యానికి పెద్ద సత్యం చేసిన సేవలను నాట్యాచార్యులు కొనియాడారు. వెంపటి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం వెంకటాచలపతి, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, వై.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి అభినయంలో అనురాధ శిష్య బృందం

పేదలకు సేవ చేయటం అభినందనీయం

రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్



పంచాయతీ కార్మికులకు సరుకులు అందజేస్తున్న రావిపాటి సిరిలాస్య

గన్నవరం, జూన్ 17 : ఉన్నదానిలో పేదలకు సహాయం చేయటం అభినందనీయమని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కేసరపల్లి పంచాయతీ కార్మికులు, వీఆర్‌ఏలు 44 మందికి సోమవారం న్యూయార్ లైన్స్‌లో 6వ తరగతి చదువుతున్న ఎన్నారై రావిపాటి సిరిలాస్య దాచుకున్న రూ.50వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు రోటరీ క్లబ్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా విజయభూషణ్‌కుమార్ మాట్లాడుతూ, చిన్న నాటి నుంచే పేదలకు సహాయం చేయాలని దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. రోటరీక్లబ్ ద్వారా సమాజ అభివృద్ధితో పాటు పేదలకు అండగా సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి నర్రా సీతారామారావు మాట్లాడుతూ, పేదలకు సేవ చేయాలనే ఆలోచన రావటం గొప్ప విషయమన్నారు. చిన్న వయస్సులోనే సిరిలాస్య పేదల గురించి ఆలోచన చేసి తను దాచుకున్న ప్యాకెట్ మనీని పది మందికి ఉపయోగపడేలా సేవ చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులు సేవాగుణాన్ని అలవరుచుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని తెలిపారు. రోటరీయన్‌లు గన్నె వెంకట్రావు, టీఎస్‌ఆర్‌కె ప్రసాద్, రవిబాబు, చేబ్రోలు జస్వంత రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



గొల్లనపల్లిలో పూజలు చేస్తున్న యార్లగడ్డ సోదరుడు సతీష్, టీడీపీ నాయకులు

గన్నవరం, జూన్ 17: టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు యనమదల సతీష్ అన్నారు. మండలంలోని గొల్లనపల్లిలో కూటమి విజయోత్సవ ర్యాలీని సోమవారం రాత్రి నిర్వహించారు. తొలుత పోలేరమ్మ, గంగానమ్మ గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారని అది నెరవేరాలంటూ విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, గ్రామాల్లో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత ఐదేళ్లలో జరిగిందేమీ లేదన్నారు. గ్రామాలకు పూర్వవైభవం వస్తుందన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్, ఉపసర్పంచ్ యనమదల సుబ్బారావు టీడీపీ గ్రామ అధ్యక్షుడు దాసరి విజయరావు, కార్యదర్శి పలగాని వేణు, కోటగిరి రామచంద్రరావు, పులపాక దేవకుమార్, కొలుసు రాంబాబు, అంకెం రామారావు, మెండె సుబ్బారావు, పలగాని వెంకటేశ్వరరావు, నాగులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్



వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు స్వీటు తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ఉయ్యూరు, జూన్ 17 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలుపుతారని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి వెంకట బాబూ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా కూటమి మండల పార్టీ నాయకులు ఆదివారం రాజేంద్రప్రసాద్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి, కేక్‌కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో ఆలోచించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే పిల్లలకు, రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఎన్నికల్లో కూటమికి పట్టం కటి, జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనను భూస్థాపితం చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, మాజీ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, కాటూరు గ్రామ అధ్యక్షుడు వెంకటనారాయణ, చంద్రశేఖర్, మండల కార్యదర్శి శరత్, నాయకులు యుగబాబు, కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.



పోలవరం ప్రాజెక్ట్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ, రామాంజనేయరాజు

సకాలంలో సాగునీరందించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్రానికి సాగునీరు, తాగునీరందించే ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్‌ను గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్తవ్యస్తమైందని రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పోలవరం సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ప్రాజెక్ట్ వద్ద సాగునీటి సమాఖ్య సభ్యులు, తెలుగురైతు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలవరం ప్రాజెక్ట్‌ను మొదలు పెట్టిన చంద్రబాబునాయుడు హయాంలోనే తిరిగి పునర్నిర్మాణ పనులు మొదలవడం ఆనందంగా ఉందన్నారు. సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రికి విన్నవించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. రామాం జనేయరాజు, గుండపనేని ఉమావర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వర్శిటీలో అక్రమాల పీహెచ్‌డీ

(5వ పేజీ తరువాయి)

- వాణిజ్య విభాగంలో అమిత అనే విద్యార్థిని తన థీసిస్‌ను సమర్పించి 14 నెలలు గడిచినా పీహెచ్‌డీని అందజేయకపోవడంతో ఆమె ఉద్యోగం పోగొట్టుకుని ఆ దిగులుతో బలవన్మరణం చెందారు. ఈ అంశంపై ఎలాంటి విచారణ చేయకుండా తొక్కిపెట్టారు.
- జర్నలిజం, మాస్ కమ్యునికేషన్ విభాగం యూనివర్సిటీలో రద్దయి రెండేళ్ల గడిచినా జర్నలిజంలో ఒకరికి గత ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఇటీవల పీహెచ్‌డీని అందజేశారు.
- పరిశోధన విభాగంలో విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన ఏడాది కాలం తరువాత కూడా పీహెచ్‌డీ పట్టాలను ఇవ్వడం లేదు.
- గత ఐదేళ్లుగా అప్పటి రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తి యూనివర్శిటీ అధికారులు పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన అంశాల్లో నిబంధలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.

మల్లవల్లిపై మళ్లీ ఆశలు

(5వ పేజీ తరువాయి)

మెగా ఫుడ్ పార్క్ పరిస్థితి మరీ దారుణం మల్లవల్లిలో 100 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కోసం లే అవుట్ వేశారు. సెంట్రల్ ఫుడ్‌పార్క్‌తో పాటు స్టేట్ ఫుడ్‌పార్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పడ్డాయి. వైసీపీ వచ్చాక ఫుడ్‌పార్క్ ధరలు మరింత పెరిగాయి. ఈ ధరలను చూసి కొత్తగా ఎవరూ ముందుకు రాలేదు. అలాగే, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మెగాఫుడ్ పార్కులో సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలన్నీ జ్యూస్ తీయటానికి, ప్యాకింగ్ చేయటానికి వీలుగా సీపీసీలో మెషినరీ ఏర్పాటు చేశారు. కోల్డ్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చేశారు. కానీ, వైసీపీ దీనిని అందుబాటులోకి తీసుకురాలేకపోయింది.

అసమగ్ర విభజన..!

(5వ పేజీ తరువాయి)

మెగాసిటీ విలీన ప్రతిపాదన జాబితాలో ఉంది. నూజివీడు మండల ప్రజలంతా ఎన్టీఆర్ జిల్లాతో నిత్యం ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటారు. వారికి ఏలూరు దూరాభారమే. ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వచ్చినపుడు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని నూజివీడు మండల ప్రజలు కోరారు. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించటంతో పాటు అధికారంలో రాగానే నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గన్నవరం, పెనమలూరు మండలాలతో పాటు నూజివీడు, ఆగిరిపల్లి, విజయవాడ రూరల్ మండలాలను కూడా ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.

హోంమంత్రి అనిత నివాస భవనం పరిశీలన



పెనమలూరు, జూన్ 17 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నివాస ముండేందుకు భవనాన్ని పోలీసు, మునిసిపల్ అధికారులు సోమవారం పరిశీలించారు. తాడిగడప మునిసిపాలిటీ కానూరు కొత్త ఆటోనగర్ రెండో రోడ్డులోని ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్‌కు చెందిన భవనాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, అదనపు ఎస్పీ ప్రసాద్, విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌లు పరిశీలించారు. భవనంలో సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్టు వారు తెలిపారు.

పింఛను భరోసా పెంచిన ఘనత చంద్రబాబుది

హనుమాన్‌జంక్షన్, జూన్ 17 : పేదవాడి సామాజిక పింఛను పథకాన్ని ప్రవేశ పెట్టిన ఘనత టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు దక్కితే ఆ పింఛను సొమ్మును 200 నుంచి రూ.2వేలు చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. సోమ వారం స్థానిక టీడీపీ మండల కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి ఐదు సంక్షేమ పథకాలపై మొదటి సంతకం చేసిన నేపథ్యంలో రాజేశ్వరరావు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా సామాజిక పింఛను సొమ్మును రూ.3 నుంచి 4వేలకు పెంచడతో పాటు గడిచిన ఏప్రిల్ నుంచి అమలు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వం అన్నక్యాంటీన్లు పెట్టి పేదవాడి ఆకలి తీర్చితే ఆ క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చివేస్తే ఆ పథకాన్ని తిరిగి అమలు చేయడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చేందనుందన్నారు. సమావేశంలో వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, గార్లపాటి రాజేశ్వరరావు, గండేపూడి నితీష్‌కుమార్ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



జంక్షన్ మసీదులో ప్రార్థనలు

గన్నవరం, జూన్ 17 : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని జామియా మసీద్ ఇమాం హపీజ్ హసీన్ ఇక్బాల్ అన్నారు. మండలంలో బక్రీద్ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ఆయన సందేశమిస్తూ అల్లా ఆదేశానుసారం ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడైన ఇస్మాయేల్‌ను త్యాగం ఇవ్వడానికి సిద్ధపడతాడని తెలిపారు. అందుకు మెచ్చిన ప్రవక్త ఇబ్రహీంను తన కుమారుని స్థానంలో మూగజీవాన్ని బలి(కుర్బానీ) ఇవ్వమని కోరతాడని చెప్పాడు. అప్పటి నుంచి బక్రీద్ పండుగ రోజున మూగజీ వాన్ని కుర్బానీ ఇవ్వటం ఆచారంగా వస్తుందన్నారు. ముస్లింలు ఐదు ముఖ్య నియమాలలో చివరిదైన జీవితకాలంలో ఒక్కసారైన హజ్‌యాత్ర చేయాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గన్నవరం, దావాజీగూడెం, దుర్గాపురం, వీరపనేనిగూడెం గ్రామాల్లో కూడా బక్రీద్ ప్రార్థనలు జరిగాయి.

హనుమాన్‌జంక్షన్ : త్యాగ పూరితమైన బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మసీదులో ఇమామ్ షఫీ కుర్ రెహ్మాన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిపారు. బక్రీద్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. స్థానిక విజయవాడ రోడ్డులోని జమాతే ఇస్లామి హింద్ ప్రార్థన మందిరంలో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. షేక్.మౌలాలీ, షేక్, నసీర్ తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఉయ్యూరు : త్యాగనిరతికి ప్రతీక ప్రసిద్ధి నొందిన బక్రీద్ పండుగను సోమవారం ఉయ్యూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమసీదు, చిన్న మసీదు, ఘోరీ మసీదు, దయారా మసీదుతో పాటు పట్టణంలో పలు మసీదుల్లో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుని ఉల్లాసంగా గడిపారు. ఉయ్యూరు మాజీ చైర్మన్ ఖుద్దూస్, ఏఎంసీ మాజీ చైర్మన్ అబుకలాం, టీడీపీ నాయకుడు అల్‌రియాజ్ తదితరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పెనమలూరు : పెనమలూరు మండలం, తాడిగడప మునిసిపాలిటీల్లోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలతో మసీదులు కిక్కిరిశాయి. కానూరు చెక్క పోస్టు మసీదు, రేకుల మసీదు, తాడిగడప, యనమలకుదురు, పోరంకి, గోసాల, గంగూరు గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ముస్తాబాదలో బక్రీద్ సందేశమిస్తున్న ఇక్బాల్



కానూరు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అరవపల్లి శ్రీకృష్ణారావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

టీడీపీ నాయకుడు, పెనమలూరు ఉప సర్పంచ్ మృతి

పెనమలూరు, జూన్ 17 : టీడీపీ సీనియర్ నాయకులు, పెనమలూరు ఉప సర్పంచ్, అరవపల్లి శ్రీకృష్ణారావు(65) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో ఆయన టీడీపీలో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన భౌతికకాయానికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శ్రీకృష్ణారావు భౌతిక కాయానికి ఘన నివాళులర్పించి టీడీపీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి వెంకట బాబూ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వ్రతం



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 17 : లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతం ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం వ్రతం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు, పుణ్యదంపతులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈవో వై.శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, సిబ్బంది పర్యవేక్షించారు.

మానసిక బాధతో ఒకరి ఆత్మహత్య

పెనమలూరు, జూన్ 17 : రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయి దివ్యాంగుడిగా మారి కొన్నేళ్లు కుటుంబ సభ్యుల పోషణలో ఉండి.. ఈ మధ్యనే పళ్ల వ్యాపారం ప్రారంభించి అందులో నష్టాలను చవిచూసి మానసిక బాధతో ఆత్మహత్య చేసుకొని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన కానూరు కామయ్యతోపు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కామయ్యతోపుకు చెందిన పువ్వుల మల్లేశ్వరరావు (42) 2017లో ప్రమాదంలో దివ్యాం గుడై సరిగా నడవలేకపోయేవాడు. కొన్నేళ్లుగా కుటుంబ సభ్యుల పర్యవేక్షణలోనే ఉండే వాడు. కుటుంబ సభ్యులకు భారంగా ఉండడం ఇష్టంలేక కొంతకాలం క్రితం పండ్ల వ్యాపారం ప్రారంభించాడు. అందులో నష్టాలను చవిచూసిన అతను శుక్రవారం మామిడిపండ్లు పండేందుకు ఉపయోగించే రసాయన ద్రావకాన్ని సేవించి ఆసుపత్రి పాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య గౌరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవతకు దుట్టా రూ.లక్ష విరాళం అందజేత



హనుమాన్‌జంక్షన్, జూన్ 17 : మానవత స్వచ్ఛంద సంస్థ రాజకీయాలకు అతీతంగా పేద వర్గాలకు విద్య, వైద్యం, ఇతర సామాజిక రంగాల్లో విశేషంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సీనియర్ వైసీపీ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు కొనియాడారు. సోమవారం స్థానిక మానవత సంస్థకు తన వంతు సాయంగా రూ.లక్ష విరాళాన్ని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు చేతులు మీదుగా హనుమాన్ జంక్షన్ శాఖకు విరాళాన్ని అందజేశారు. పేద వర్గాలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని దుట్టా కోరారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు సుబాచారి, కళ్లేపల్లి నారాయణరావు, జేవీవీ సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేమల్లె నుంచి ద్వారకాతిరుమలకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 17 : రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా గెలవాలని మొక్కుకున్న రేమల్లె టీడీపీ శ్రేణులు మొక్కులు తీర్చుకునేందుకు సోమవారం బయలుదేరారు. రేమల్లెకు చెందిన వడ్లమూడి జానకిరామ్మూర్తి ఆధ్వర్యంలో కాలినడకన ద్వారకాతిరుమల బయలుదేరిన టీడీపీ శ్రేణులకు అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, సుధాకర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రలో చల్లగుళ్ల సాంబశివరావు, పల్లిపాముల వంశీ, సొదిమెళ్ల శేషు, మేరుగు కార్తీక్, సొదిమెళ్ల రాజేష్, రాచప్రోలు ఇమాన్యుల్ బయలు దేరివెళ్లారు. హనుమాన్ జంక్షన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వర రావు స్వాగతం పలికి అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయానంద్, వడ్లపట్ల రాంబాబు, కొల్లూరు చంద్రకాంత్, పాండురంగారావు, గణేష్, దుర్గారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రకు జెండా ఊపి ప్రారంభిస్తున్న యనమదల శ్రీనివాసరావు, సుధాకర్

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 152, 161, 172
చికెన్ విత్ స్కిన్ 296
చికెన్ స్కిన్‌లెస్ 306

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

సాయిబాబాకు లక్ష గులాబీలతో అర్చన



గండిగుంట(ఉయ్యూరు), జూన్ 17 : జేష్ఠమాసం నిర్జల ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణం బాబా ఆలయంలో సోమవారం బాబాకు లక్షగులాబీల అర్చన, పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ కంచర్ల గంగాధరరావు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ మండవ జయదేవ్ పాల్గొని సేవలందించారు.

డ్రెయిన్ల ప్రక్షాళనకు శ్రీకారం

పనులు పరిశీలించి, సూచనలు ఇచ్చిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 17 : తాడిగడప మునిసిపాలిటీ కానూరులో డ్రెయిన్ల ప్రక్షాళనకు వెంటనే చర్యలు చేపట్టాలని మునిసిపల్ అధికారులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశించారు. సోమవారం డ్రెయిన్లలోని గుర్రపు డెక్క, తూటుకాడ, తూముల్లోని సిల్టు తొలిగించే పనులను పరిశీలించారు. ఏలూరు కాల్వ నుంచి కొత్త ఆటోనగర్, కానూరు బాడవ డొంక, హరిజనవాడ నుంచి చిన్నచెరువు వరకు ఉన్న ప్రధాన మురుగు కాల్వ ప్రక్షాలన పనులకు యంత్రాలతో శ్రీకారం చుట్టారు. పనుల పరిశీలనలో అనుమోలు ప్రభాకరరావు, అంగిరేకుల మురళి, పీతా గోపీచంద్, తాళ్ల నరేంద్ర, దోనేపూడి రవికిరణ్, సత్రం శివయ్య, గుంటుపల్లి శ్రీనివాస్, కరిమికొండ సురేష్, ముంగి సుబ్బారావు, వెంకటరావు తదితరులు ఉన్నారు.



కానూరులో డ్రెయిన్ల ప్రక్షాళన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మురుగునీటికి అడ్డుకట్ట

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ సివరేజి ప్లాంటు నుంచి మురుగు, వ్యర్థాలను ఎటువంటి శుద్ధి ట్రీట్‌మెంటు లేకుండా కృష్ణానదిలోకి వదిలిపెడుతున్న కారణంగా యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల నదీ పరీవాహక ప్రాంతాల్లో నీరు కలుషితం అవుతున్న దృష్ట్యా అప్రమత్తమైన తాడిగడప మునిసిపాలిటీ అధికారులు ఆదివారం నుంచి కార్పొరేషన్ అధికారులు తవ్విన కాల్వను పూడ్చడం ప్రారంభించారు. ఈ పనులను సోమవారం కూడా కొనసాగించి కార్పొరేషన్ అధికారులు యనమలకుదురు సమీపంలోని రామలింగేశ్వరనగర్ వద్ద తవ్విన కాల్వను పూడ్చివేశారు. దీంతో కార్పొరేషన్ మురుగు నీరు కృష్ణానదిలో కలవకుండా అడ్డుకట్టవేసినట్లయిందని తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు.



రేషన్ డీలర్ల సమస్యలపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కాగిత కొండ

రేషన్ డీలర్ల బిల్లుల మంజూరుకు కృషి

రేషన్ డీలర్ల బిల్లులు త్వరలో మంజూరు చేసేందుకు కృషి చేస్తామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. సోమవారం పోరంకి ఎమ్మెల్యే కార్యాలయంలో రేషన్ డీలర్లకు రావాలిసిన మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన సరుకుల రవాణా ఛార్జీలను డీలర్ల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాగిత కొండ (జేమ్స్) ఆధ్వర్యంలో సభ్యులు కోరగా ఎమ్మెల్యే స్పందించి కృష్ణాజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి పార్వతికి ఫోన్ చేసి రేషన్ డీలర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆదేశించారు. స్పందించిన డీఎస్వో పార్వతి రేషన్ డీలర్ల అధ్యక్ష, కార్యదర్శుల సంతకాలు పూర్తయిన వెంటనే బకాయిలు చెల్లిస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఘట్టమనేని నాగబాబు, మాదు శోభన్, లుక్కా అరుణ్‌బాబు, సింహాద్రి కాశీ తదితరులు ఉన్నారు.

సువర్చల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

మాదాసువారి పాలెం (కంకిపాడు), జూన్ 17 : మండలంలోని మాదాసువారి పాలెంలోలోని శ్రీ సువర్చల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త కొప్పరాజు సురేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త ముప్పా రాజాలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాంరు. అనంతరం బోడె ప్రసాద్ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రాంరంభించారు.

కొండేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వీరవల్లి కొండేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నిర్జలఏకాదశి సందర్భంగా అర్చకులు కుందుర్తి మురళీ ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. తెల్లవారుఝా మునుంచి స్వామి వారికి గణపతిపూజ, మాహాన్యాస రుద్రాభిషేకం, పసుపు, కుంకుమ, విభూతి, చందనంతో పంచద్రవ్యాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. తెల్లవారురుఝాము నుంచి భక్తులు బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణను సన్మానిస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, ఇతర నాయకులు

మాజీ ఎంపీ కొనకళ్లకు అభినందన

ఉయ్యూరు, జూన్ 17 : మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించడంపట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుకు తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు, నాయకులు అభినందనలు తెలిపారు. మచిలీపట్నం ఆయన నివాసంలో సోమవారం కొనకళ్లను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



తిప్పనగుంటలో రహదారి వెంబడి మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి రాజేష్, సాయిల నాగేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 17 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి రాజేష్ పిలుపు నిచ్చారు. తిప్పనగుంటలో రహదారి వెంబడి ఫల, పుష్ప మొక్కలను సోమవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి నాటారు. పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సకాలంలో వర్షాలు పడతాయని, ఎల్‌నినో వల్ల వేసవిలో మండే ఎండలను చూసామన్నారు. రైతులు కూడా గట్లవెంబడి మామిడి లాంటి మొక్కలు వితరణ చేసేందుకు ముదునూరి మహేష్ సిద్ధంగా ఉన్నట్లు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిల నాగేశ్వరరావు, మొవ్వా పండుబాబు, మద్దాల రంగారావు, పవన్, సాయిరాం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 17 : కాకులపాడు రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య మహిళలు, భక్తుల రామనామ స్మరణలతో పోట్ల వెంకటసుబ్బారావు, అట్లూరి వెంకట ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా సీతారామ కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దొప్పలపూడి వెంకటేశ్వరావు, చలసాని పూర్ణబ్రహ్మయ్య, కామినేని శ్రీహరి, వీరపనేని రాజా, తిపిర్నేని సత్యన్నారాయణ, తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షించారు.



కాకులపాడు రామాలయంలో కల్యాణోత్సవం

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	296
చికెన్ స్కిన్‌లెస్	306



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80



పైప్‌లైన్లకు మరమ్మతులు చేయిస్తున్న కరుణాకర్

జనసేన నాయకుడు కరుణాకర్ చొరవ

మచిలీపట్నం టౌన్ : నగరంలోని 11వ డివిజన్ ఆదర్శనగర్‌లో పైపులైన్లు లీకులవుతున్నాయి. కలుషితమైన నీరు రావడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. జనసేన నాయకుడు బండి కరుణాకర్ చొరవ చూపి పైపులైన్లకు మరమ్మతులు చేయించారు.



కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న వైఖానస మండలి సభ్యులు

మంత్రి రవీంద్రకు సమస్యలపై వినతులు

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : రాష్ట్ర గనులు, ఎక్సైజ్, జుయాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను సోమవారం పలువురు కలసి తమ సమస్యలు వివరించారు. బీటీఏ నాయకులు కైతేపల్లి దాసు తదితరులు ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. 117 జీవోను రద్దు చేసి అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థను గాడి లో పెట్టాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్, కొమ్ము నూకాలయ్య, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, రాజారాహుల్, గంటా పీటర్‌సన్ పాల్గొన్నారు. వైఖానస మండలి సభ్యులు మంత్రిని కలిసి సత్కరించారు. దేవాలయాల అభివృద్ధికి, ధర్మపరిరక్షణకు కృషి చేయాలని కోరారు.



పెదపారుపూడిలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఖమ్మం మేయర్ మీరజా తదితరులు

రామోజీరావు సేవలు స్ఫూర్తిదాయకం

పెదపారుపూడి, జూన్ 17 : చెరుకూరి రామోజీరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మం మున్సిపల్ మేయర్ మీరజా అన్నారు. స్వగ్రామం పెదపారుపూడిలో సోమవారం రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ మీరజా మాట్లాడుతూ, పెదపారుపూడి గ్రామాన్ని ప్రపంచ స్థాయిలో నిలిపిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని సుమారు రూ.20 కోట్లు ఖర్చు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. కష్టపడి పని చేస్తే సాధించలేనిది ఏమీ ఉండదనేతత్వంతో ముందుకు వెళ్లారని అన్నారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా, చప్పిడి కిషోర్, పునుకొల్లు ప్రసాద్, పునుకొల్లు రత్న ప్రసాద్, చంద్రశేఖరరావు, పునుకొల్లు బెనర్జీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



మహిషాసురమర్దిని అంశంలో నర్తిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : మచిలీపట్నం రామలింగేశ్వర స్వామి దేవస్థానంలోస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం బాలా త్రిపుర సుందరీ నృత్యనికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి. నాట్యాచార్యుడు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో కళాకారిణిలు అన్నమయ్య కీర్తనలకు నృత్య ప్రదర్శనలిచ్చారు. మహిషాసురమర్ధనీ అంశం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆలయ కార్యనిర్వహణాధికారి బి. సుబ్బారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



యూవీఆర్ గొర్రెపాటి పాఠశాలను ప్రారంభిస్తున్న బౌద్ధ భిక్షువు బంతేజీ

యువీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రారంభం

ఘంటసాల : ఘంటసాల పరిసర గ్రామాల విద్యార్థులకు విద్యనందించేందుకు తనతల్లిదండ్రులైన వెంకట్రాయులు-ఉదయ భాస్కరమ్మ పేరిట పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్‌బాబు పేర్కొన్నారు. యూవీఆర్ గొర్రెపాటి స్కూల్‌ను బౌద్ధ భిక్షువు దమ్మధజ బంతేజీ బౌద్ధ ఆచారం ప్రకార పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఎన్ఆర్ఐ రంగనాథ్ బాబు తన సందేశం పంపించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, చల్లపల్లి విజయా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, గొర్రెపాటి విద్యాట్రస్ట్ ప్రతినిధులు కొండపల్లి రామకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర పథకాలపై విచారణ జరపాలి : లకనం

అవనిగడ్డ : గత వైసీపీ పాలనలో అమలు చేసిన ఫిష్ ఆంధ్రా పథకాలపై తక్షణం విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి, టీడీపీ నేత లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం అవనిగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిష్ ఆంధ్ర పథకాలలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయన్నారు. ఈ పథకాల అమలుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 3106 యూనిట్లు మంజూరు చేసి, రూ.450 కోట్లు కేటాయించిందన్నారు. 2113 ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఏర్పాట్లు చేసినట్లు మత్స్యశాఖ అధికారులు లెక్కలు చెబుతున్నారని, వాస్తవంగా రాష్ట్రంలో సగానికిపైగా యూనిట్లు మూతవేశారన్నారు. అర్హులైన నిరుద్యోగ మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాల్సిన మత్స్యశాఖ వారిని విస్మరించి ఫిష్ ఆంధ్ర పథకం యూనిట్లను ఎంటర్ప్రెన్యుర్స్ పేరుతో అనర్హులకు కట్టబెట్టిందని విమర్శించారు. 60 శాతం సబ్సిడీ యూనిట్లు ఏ వర్గాలకు కేటాయించారో నిగ్గు తేల్చి, బాధ్యులైన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

దళితవాడ తాగునీటి సమస్య పరిష్కరించాలి



పెదపారుపూడి : వెంట్రప్రగడ గ్రామ శివారు పెద్ద దళితవాడలో గత 20 రోజుల నుంచి తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా సమస్యను పెడచెవిన పెడుతున్నారని గ్రామస్థులు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీలో నిధులు లేవని, నిధులు రాగానే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెప్పటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు, మూడు కిలోమీటర్లు ఊరిలోకి వచ్చి తాగునీరు తెచ్చుకోవాలి అంటే ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అవనిగడ్డలో బక్రీద్ సందేశమిస్తున్న మత పెద్ద ఎండీ షజాద్



తోట్లవల్లూరు మసీదులో సందేశమిస్తున్న మత గురువు హసన్



బంటుమిల్లిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

త్యాగానికి ప్రతీక బక్రీద్

చల్లపల్లి, జూన్ 17 : ప్రవక్తల త్యాగ నిరతికి బక్రీద్ ప్రతీక అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. సోమవారం చల్లపల్లి మహమ్మదీయ మసీదులో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెంకట్రామ్ ముస్లింలకు స్వీట్లు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావి చిట్టి, తెలుగుయువత జిల్లా నేత మోర్ల శివ, జనసేన నేతలు పసుపులేటి రవికుమార్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, ఉరిమి మణికాంత్, గంగిశెట్టి రాజేంద్ర, పినిశెట్టి నిరంజన్, చేతన్, సతీష్, వార్డుసభ్యుడు షేక్ సిలార్, మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ నసీం ఘోరి తదితరులు పాల్గొన్నారు. **అలీనఖీపాలెం(పమిడిముక్కల) :** త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగను అలీనఖీపాలెంలో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పెద్దమసీదు(మస్జిద్ హుసేన్ జామియా)లో మతగురువు మౌలానా మీర్జా ఇబ్రహీం అలీ పండుగ విశిష్టతను తెలియజేశారు. హజ్రతే ఇబ్రహీం, హజ్రత్ ఇస్మాయిల్ ప్రవక్తల త్యాగాలకు ప్రతీకగా బక్రీత్ జరుపుకుంటారని వివరించారు. అంజుమన్ పెద్దలు, గ్రామస్థులు ప్రార్థనలో పాల్గొన్నారు. **కూచిపూడి :** త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకున్నారు. మొవ్వ, నిడుమోలు, కూచిపూడి, పెదపూడి, భట్లపెనుమర్రు, కోసూరు, కాజ తదితర గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను తెలియజేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. **అవనిగడ్డ :** బక్రీద్ పర్వదినాన్ని అవనిగడ్డలో ఘనంగా జరుపుకున్నారు. జామియా మసీదు వద్ద ఎండి.షజాద్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ అబ్దుల్ రెహమాన్, షేక్ బాజావలి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు **నాగాయలంక :** ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జామియా మసీదులో మత పెద్ద షేక్ సత్తార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఖురాన్ గ్రంథ పఠనం చేసి బక్రీద్ పండుగ త్యాగనిరతికి ప్రతీక అని వివరించారు. ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. షేక్ జాని పర్యవేక్షించారు. **పెదపారుపూడి :** స్వార్థం, అసూయ, రాగ ద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయటమే బక్రీద్ ముఖ్య ఉద్దేశ్యమని వెంట్రప్రగడ మసీదు ఇమామ్ అన్నారు. వెంట్రప్రగడ, లక్ష్మీపురం, కొర్నిపాడు తదిరత గ్రామాల్లో బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకున్నారు. షేక్ బాబీ, కరీముల్లా, షేక్ బాబ్జీ, సర్దార్ సమీర్, నజీర్ చోటే, ముస్లీం పెద్దలు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** త్యాగాలకు ప్రతీకగా బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్ద అబ్దుల్ ఉమ్రీ యూనస్ మాట్లాడుతూ, మానవునిలో ప్రతికూల శక్తులు నశించి, సానుకూల దృక్పథం అలవడేందుకు బక్రీద్‌ను నిర్వహిస్తామన్నారు. పెదముద్దాలి, సప్తార్‌ఖాన్‌పాలెం, నిభానుపూడి గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముస్లింలకు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా శుభాకాంక్షలు తెలియజేశారు. **తోట్లవల్లూరు :** తోట్లవల్లూరు మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతగురువు హసన్ బక్రీద్ సందేశం ఇచ్చారు. **బంటుమిల్లి :** స్వార్థాన్ని త్యజించాలన్నదే పవిత్ర బక్రీద్ సందేశం అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బక్రీద్ పర్వదిన్నాన్ని పురస్కరించుకుని మండలంలోని మసీదులలో ప్రార్థనలు చేశారు. **గుడ్లవల్లేరు :** బక్రీద్ ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొన్నారు. కౌతవరం, గుడ్లవల్లేరు, డోకిపర్రు, వేమవరం, పెం జంద్ర, అంగలూరు, కట్టానిచెరువు, సుబ్బిచెరువు, శేరిదగ్గుమిల్లి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.



అలీనఖీపాలెం పెద్ద మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చల్లపల్లి మసీదు వద్ద బక్రీద్ వేడుకల్లో మండలి వెంకట్రామ్



కూచిపూడిలో చిన్నారుల శుభాకాంక్షలు



పామర్రులో సందేశమిస్తున్న అబ్దుల్ ఉమ్రీ యూనస్



కౌతవరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కొంకేపూడిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



చల్లపల్లిలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

సుపరిపాలనకు శ్రీకారం : ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి, జూన్ 17 : రాష్ట్రంలో విధ్వంసక పాలన అంతమొంది సుపరిపాలన ప్రారంభమైందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లిలోని పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో కాగిత మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఐదు హామీలపై సంతకాలు చేసి ప్రభుత్వాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు పునాది వేశారన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంపు అమలు చేయడం జరిగిందన్నారు. అన్నా క్యాంటీన్ తిరిగి పునఃప్రాంభించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఇల్లూరి లీలా కృష్ణ, బొర్రా కాశీ, రేవు గోపాలకృష్ణ, రేవు శ్రీనివాసరావు, జొన్నలగడ్డ కొండ పాల్గొన్నారు.

కొంకేపూడిలో సంబరాలు

పెడన రూరల్ : ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సోమవారం కొంకేపూడి గ్రామంలో విజయోత్సవంలో పాల్గొన్నారు. శాసనసభ్యునిగా విజయం సాధించి తొలిసారి వచ్చిన కృష్ణప్రసాద్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. ఇన్‌పుట్ సబ్సిడీలో జరిగిన అవకతవకల జాబితాను కృష్ణప్రసాద్‌కు అందించి న్యాయం చేయాలని రైతులు కోరారు. శలపాటి ప్రసాద్, అర్జా నగేష్, శీరం ప్రసాద్, ఊచా వెంకయ్య, గుడిశేవ రామారావు, పరసా రాంబాబు, కట్టా సతీష్, పరసా కామేశ్వరరావు, గంధం గోపాలకృష్ణ, చెన్నూరు శేఖర్, కట్టా నాగరాజు, సొంతి రాము, వంశీ పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

చల్లపల్లి : ప్రజలకిచ్చిన హామీల అములులో భాగంగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు చేసిన తొలి ఐదు సంతకాలతో పేదలు, వృద్ధులు, యువత, రైతుల జీవితాల్లో వెలుగులు నింపటంతో చల్లపల్లిలో సంబరాలు అంబరాన్నంటాయి. మండల టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చల్లపల్లి ప్రధాన సెంటర్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆవు నెయ్యి, ఆవు పాలు, పూలతో వినూత్నంగా అభిషేకాలు నిర్వహించి జేజేలు పలికారు. మండలి వెంకట్రామ్, మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పైడి పాముల స్వప్న, మాలెంపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, నిడమానూరి దిలీప్‌కుమార్, షేక్ నబీఘోరి, వేమూరి గోవర్ధన్, గుత్తికొండ వంశీకృష్ణ, మోర్ల శివ, రావి రాజేశ్వరరావు, తాతా ప్రదీప్, జనసేన నేతలు ఉస్మాన్ షరీఫ్, సోమిశెట్టి రాఘవేంద్రరావు, పసుపులేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోడూరు ఎస్టీ కాలనీలో..

కోడూరు : కోడూరు ఎస్టీ కాలనీలోచంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బొడ్డు వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, గోగినేని సోమశేఖరరావు, మద్దూరి కాంతారావు, ఉల్లి శేషగిరి, మేడ శివాజీ, వేములపల్లి రాజేష్, వేములపల్లి శ్రీకృష్ణ, బెల్లంకొండ కూర్మా కోటేశ్వరరావు, దావు మల్లి, బొప్పన వేణు, లంకే రవి, కాగిత ప్రసాద్, పాశం పాండురంగారావు, వీరంకి వెంకటేశ్వరరావు, బడే పిచ్చియ్య, మింగు శివయ్య పాల్గొన్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నాగాయలంక : ఏటిమొగ, నాగాయలంక సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలైన ఏటిమొగ, గుల్లలమోద, పెదకమ్మవారిపాలెం, ఎదురుమొండి, జింకపాలెం, నాచుగుంట, నాగాయలంక చుట్టూపక్కల తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 7. గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మత్తులు పనులు చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గో ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలుకరం

మచిలీపట్నం టౌన్ : గో ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయని మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, వాసుదేవ గోశాల నిర్వాహకుడు పల్లపాటి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈడేపల్లిలో వాసుదేవ గోశాల ఆధ్వర్యంలో మహిళలకు గో ఉత్పత్తులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. గోమూత్రం, ఆవుపేడ, ఆవు పాలతో ఉత్పత్తులు ఎలా తయారు చేయాలో వివరించారు. అనేక వ్యాధులు గోమూత్రం వల్ల నయమవుతాయన్నారు. లక్ష్మి, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత లక్ష్మణరావు జన్మదిన వేడుకలు

నాగాయలంక : మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు జన్మదిన వేడుకలు సోమవారం రాత్రి వంగవీటి మోహనరంగా విగ్రహం సెంటర్‌లో ఘనంగా జరిగింది. కూటమి నేతల సమక్షంలో మెండు లక్ష్మణరావు కేక్ కట్ చేయగా, చప్పట్లతో ఆయనకు అభినందనలు తెలిపారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం

మచిలీపట్నం టౌన్, జూన్ 17 : విద్యా సంస్థలకు మచిలీపట్నం వాసవీ క్లబ్, వాసవీ కపుల్స్ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి డాక్టర్ కొల్లూరు ప్రకాష్ అన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో సోమవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ యెండూరి సురేష్, ఉపాధ్యక్షురాలు సామా వెంకటలక్ష్మి, కాంతారావు తదితరులు పాఠశాలలు, దేవాలయాలకు వాటర్ ట్యాంకులు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, జాకెట్లు ఇచ్చారు. పేదలకు గొడుగులు పంచారు. వేముల కృష్ణమూర్తి, జల్లూరి రాంబాబు, జయవరపు ప్రసాద్,తమ్మన అనూరాధ, శ్రీదేవి, ఉడత్తు శ్రీనివాస్, తమ్మన మధుసూధనరావు, జల్లూరి దివ్యశ్రీ, అన్నం అశోక్, వలివేటి లక్ష్మి, రంగనాయకులు, వేముల శిరీష తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే నీటి కొరత

గుడివాడ : గుడివాడ మున్సిపాల్టీలో తాగునీటి కొరతకు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని సీపీఎం కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. సుందరయ్యభవన్‌లో ఆయన మాట్లాడుతూ పంపుల చెరువులు రెండు ఉన్నా లాభం లేదన్నారు. ఒకటేమో గండిపడి కట్ట తెగితే, మరొక దాంట్లో పూర్తిస్థాయిలో నీరు నింపకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. లీకేజీల కారణంగా తాగునీటి స్థానంలో రంగుమారిన నీరు సరఫరా జరుగుతుందోని ఆరోపించారు.